


కేంద్ర సహాయ మంత్రి వర్మకు పితృవియోగం

నేడు బలుసుమూడిలో అంత్యక్రియలు



భీమవరం : కేంద్ర ఉక్కు భారీ పరిశ్రమ శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మకు పితృ వియోగం కలిగింది. తండ్రి భూపతి రాజు సూర్యనారాయణ రాజు గత కొంత కాలం నుంచి అనారోగ్యానికి గురయ్యారు. హైదరాబాద్‌లో ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సూర్యనారాయణ రాజు(91) గురువారం సాయంత్రం మృతి చెందారు. ఆయనకు భార్య సీత, కుమారుడు కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాస్ వర్మ, మరో ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. సూర్యనారాయణ రాజు సాంఘిక సంక్షేమ శాఖలో జిల్లా అధికారిగా పనిచేసి ఉద్యోగ విరమణ చేశారు. సూర్యనారాయణ రాజు భౌతిక కాయన్ని శుక్రవారం ఉదయం కేంద్ర మంత్రి స్వగ్రామంలో సందర్శనార్థం ఉంచనున్నారు. అనంతరం భీమవరం టూ టౌన్ పరిధిలోని బలుసు ముడి మోక్ష ధామంలో మధ్యాహ్నం ఒంటిగంటకు అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

ఈ ప్రయోగాలేమిటో..!

హైస్కూల్స్ సమయం మార్పుతూ విద్యాశాఖ ఉత్తర్వులు

ఉమ్మడి పశ్చిమలో 47 పాఠశాలల్లో అమలు

ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పని గంటల పెంపు

పెదవి విరుస్తున్న ఉపాధ్యాయ సంఘాలు



ప్రజాశక్తి - భీమవరం

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల నిర్వహణా సమయం మార్పు చేస్తూ విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు తరగతులు నిర్వహించాలని ఆదేశించింది. ఈ విధానం గురువారం నుంచి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని 47 హైస్కూళ్లలో అమల్లోకి వచ్చింది. అయితే ఈ విధానాన్ని ఉపాధ్యాయ సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. పని గంటల మార్పుతో అనేక ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడతాయని చెబుతున్నారు. విద్యార్థులపై ఒత్తిడే కాకుండా దూర ప్రాంతాలకు వెళ్లే విద్యార్థుల పరిస్థితి మరింత దయనీయంగా మారే ప్రమాదం ఉందంటున్నారు. కొన్ని ప్రాంతాల్లో పాఠశాలకు, విద్యార్థుల ఇళ్లకు సుమారు నాలుగు కిలోమీటర్ల మేర దూరం ఉంది. ఈ పరిస్థితుల్లో సాయంత్రం ఐదు గంటలకు పాఠశాల నుంచి ఇంటికెళ్లేసరికి చీకటి పడే అవకాశం ఉంది. ప్రస్తుతం శీతాకాలం కావడంతో సాయంత్రం ఐదు గంటలకే చీకట్లు అలుముకుంటున్నాయి. ఈ నేపథ్యంలో విద్యార్థులు ముఖ్యంగా విద్యార్థినులు ఇబ్బందులు పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

ఉమ్మడి జిల్లాలో సుమారు 500 హైస్కూళ్లు ఉన్నాయి. అయితే మండలానికి ఒక పాఠశాల చొప్పున పైలెట్ ప్రోగ్రామ్‌గా పాఠశాల సమయం పెంపు అమలు చేస్తున్నారు. ఏలూరు జిల్లాలో 27, పశ్చిమగోదావరిలో 20 స్కూళ్లల్లో సమయాన్ని మార్పు చేసి అమలు చేస్తున్నారు. ఇదిలా ఉంటే ఇప్పటి వరకూ ఒక్కో పీరియడ్ 40 నిమిషాలు ఉండగా దాన్ని 45 నిమిషాలకు పెంచారు. ఈ నెల 30వ తేదీ వరకు పైలెట్ పాఠశాలల్లో ఈ విధానం అమలు కానుంది. ఈ బాధ్యతను ఆయా డివైఇఒలకు అప్పగించారు. పైలెట్ ప్రోగ్రాంపై ఉపాధ్యాయులు విద్యార్థులు, వారి తల్లిదండ్రుల నుంచి అభిప్రాయాలు సేకరించి జిల్లా విద్యాశాఖకు సమర్పించనున్నారు. అయితే సమయాన్ని పెంచుతూ విద్యాశాఖ తీసుకున్న నిర్ణయంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత ప్రభుత్వం ఇప్పటికే నూతన విద్య విధానం పేరుతో పాఠశాలల వ్యవస్థను నాశనం చేసింది. పాఠశాలల విలీనం, యాప్‌ల పేరిట ఉపాధ్యాయులను బోధనకు దూరంగా, విద్యార్థులను విద్యకు దూరంగా ఉంచిందనే విమర్శలు ఉన్నాయి. గతంలో వీటన్నింటినీ వ్యతిరేకించి అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం గత ప్రభుత్వ విధానాలనే కొనసాగిస్తుందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

సమయం పెంపుపై పునరాలోచించాలి

పిఎస్.విజయరామరాజు, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు



జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల నిర్వహణా సమయాన్ని పెంచుతూ ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలపై పునరాలోచించాలి. ఈ విధానాన్ని అమలు చేస్తే అనేక ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉంది. విద్యార్థుల మానసిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకోవాలి. జిల్లాలో ఉన్నత పాఠశాలల చుట్టూ 5, 6 కిలోమీటర్ల దూరం నుంచి విద్యార్థులు పాఠశాలలకు రావాల్సి ఉంది. పాఠశాల ముగిసిన తర్వాత ఇంటికెళ్లేసరికి చీకటి పడే అవకాశం ఉంది. దీనిని ప్రభుత్వం దృష్టిలో ఉంచుకుని ప్రస్తుత విధానాన్నే కొనసాగించాలి.

విద్యార్థులు గందరగోళానికి గురయ్యే పరిస్థితి ఉంది

వివి.రమణ, ఎపిటిఎఫ్-1938 జిల్లా ప్రధాన కార్యదర్శి



ఈ విద్యా సంవత్సరం మధ్యలో ఉన్నత పాఠశాలల పని గంటలు మారుస్తూ నిర్ణయం తీసుకోవడం సరైంది కాదు. విద్యార్థులు ఒకింత గందరగోళానికి గురయ్యే పరిస్థితి ఉంది. సాయంత్రం ఐదు గంటల తర్వాత సుదూర ప్రాంతాలకు వెళ్లే విద్యార్థినులు భద్రత దృష్ట్యా ఇబ్బందులు పడే అవకాశం ఉంది. మార్చిన పని వేళల వల్ల వారి సంగ్రహణ శక్తి కోల్పోయే ప్రమాదం ఉంది.

ప్రస్తుత పద్ధతినే కొనసాగించాలి

ఎన్.శ్రీనివాసరావు, డిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు



విద్యార్థులు పాఠశాలలకు వచ్చే దారిలో మద్యం షాపులు ఉన్నాయి. సాయంత్రం ఐదు గంటల వరకు పాఠశాలలో నిర్బంధిస్తే తిరిగి ఇంటికి వెళ్లే సమయంలో దారిలో ఉన్న దుకాణం వద్ద మద్యం సేవించిన వారితో విద్యార్థులకు ఇబ్బందులు ఎదురయ్యే పరిస్థితి ఉంది. విద్యార్థులు కూడా ధైర్యంగా వెళ్లే పరిస్థితి ఉండదు. పాఠశాలలకు సమయం పెంపు అనేది ప్రస్తుత పరిస్థితుల్లో సరైంది కాదు. ప్రస్తుతం ఉన్న పద్ధతినే కొనసాగించాలి. పాఠశాల సమయం పెంచడమే కాకుండా విద్యార్థుల భద్రత కూడా ముఖ్యం అనేది ప్రభుత్వం గుర్తించాలి.

సమస్యలను పరిగణనలోకి తీసుకోవాలి

పెన్మెత్స సాయివర్మ, ఎస్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి



విద్యార్థులు పాఠశాలల నుంచి ఇంటికి తిరిగెళ్లే దారిలో చెరువు గట్లు, చేలు, తోటలు, తుప్పలు ఉంటాయి. వీటి గుండా విద్యార్థులు వెళ్లాల్సి ఉంది. విద్యార్థులు తిరిగి ఇంటికి వెళ్లే సమయంలో అనేక సమస్యలు ఎదుర్కొనే అవకాశం ఉంది. దీన్ని ప్రభుత్వ పెద్దలు, విద్యాశాఖ రాష్ట్ర అధికారులు గమనించాలి.సమయాన్ని పెంచకుండా యధావిధిగా కొనసాగించాలి.

మహిళలపై అఘాయిత్యాలను అరికట్టాలి

ఐద్వా ఆధ్వర్యాన నిరసన



నిరసన తెలుపుతున్న ఐద్వా నేతలు

ప్రజాశక్తి - భీమవరం

మహిళలపై రోజురోజుకీ పెరుగుతున్న అఘాయిత్యాలను అరికట్టాలని ఐద్వా జిల్లా కార్యదర్శి పొగాకు పూర్ణ డిమాండ్ చేశారు. ఐద్వా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని రెండో వార్డులో వైజాగ్‌లో లా కళాశాల విద్యార్థినికి సామూహిక అత్యాచారానికి వ్యతిరేకంగా గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పూర్ణ మాట్లాడుతూ జులై నుంచి ఇప్పటి వరకు 98 మందిపై అఘాయిత్యాలు జరిగాయన్నారు. అయితే ఏఒక్కరికీ శిక్ష పడలేదన్నారు. గంజాయి, అశ్లీల సాహిత్యం వల్ల మహిళలపై దాడులు విపరీతంగా పెరిగిపోయాయన్నారు. చట్టాన్ని, న్యాయాన్ని కాపాడాల్సిన విద్యార్థులే సహచర విద్యార్థినిపై అత్యాచారానికి పాల్పడటం దారుణమని, దోషులను కఠినంగా శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్.ఉదయకుమారి, ఎస్.జయప్రద, ఎ.నాగరత్నం, ఎం.సరోజిని, మహిళలు పాల్గొన్నారు.

పిఎసి ఛైర్మన్‌గా ఎంఎల్ఎ అంజిబాబు!

ప్రజాశక్తి - భీమవరం టౌన్

పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్(పిఎసి) పోస్ట్ జనసేన ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులుకు(అంజిబాబు) దక్కనుంది. అంజిబాబు పేరును జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ గురువారం ప్రతిపాదించారు. పిఎసి ఛైర్మన్ ఎన్నికను శుక్రవారం నిర్వహించనున్నారు. ఈ ఎన్నిక లాంఛనమే కానుంది. సాధారణంగా పిఎసి కమిటీ ఛైర్మన్‌గా ప్రతిపక్షానికి చెందిన ఎంఎల్ఎకు ఇవ్వాల్సి ఉంది. కానీ ప్రతిపక్షానికి సంఖ్యాబలం తక్కువగా ఉండటంతో ఈ పదవిని జనసేన ఎంఎల్ఎకు కేటాయించారు. భీమవరం ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) పిఎసి ఛైర్మన్‌గా ఎన్నిక కావడంతో భీమవరంలోని జనసేన నాయకుల్లో జోష్ నెలకొంది. అంజిబాబు భీమవరం ఎంఎల్ఎగా మూడోసారి జనసేన నుంచి గెలుపొందారు. మొదటినుంచి ఈ స్థానాన్ని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పోటీ చేస్తారని భావించారు. చివర్లో ఎన్నికల పొత్తులో భాగంగా ఈ స్థానాన్ని అంజిబాబుకు కేటాయించారు. సమయం తక్కువ ఉన్న ఈ ఎన్నికల్లో అంజిబాబు జనసేన నుంచి భారీ మెజార్టీతో గెలుపొందారు. పవన్ కళ్యాణ్ దృష్టిలో అంజిబాబుపై సానుకూల ధృక్పథం ఉండడంతో ఆయనను పిఎసి కమిటీ ఛైర్మన్‌గా నిలబెట్టారు.



అంజిబాబును అభినందిస్తున్న చిన్నబాబు

ఆర్‌డిఒను కలిసిన డిఎస్‌పి

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం ఆర్‌డిఒ దాసి రాజును డిఎస్‌పిగా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ జి.శ్రీవేద గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆర్‌డిఒ దాసి రాజుకు పూలమొక్క డిఎస్‌పి శ్రీవేద పూలమొక్క అందజేశారు. అనంతరం ఇరువురు పలు అంశాలపై చర్చించుకున్నారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ రాజు మాట్లాడుతూ శాంతిభద్రతల పర్యవేక్షణలో పోలీసుల బాధ్యత ఎక్కువగా ఉంటుందని, నరసాపురం డివిజన్ పరిస్థితులను అవగాహన చేసుకుని ప్రజలకు అత్యుత్తమ సేవలు అందించాలని, తద్వారా ప్రజల ఆదరాభిమానాలు పొందాలని డిఎస్‌పికి సూచించారు.

డిఎస్‌పిని కలిసిన కమిషనర్

నరసాపురం డిఎస్‌పి డాక్టర్ జి.శ్రీవేదను నరసాపురం మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఆమెకు కమిషనర్ పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.



ప్రభుత్వాసుపత్రుల్లో మంచి సేవలందించాలి

వైద్యులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలి

కలెక్టర్ చదలవాడ నాగరాణి



మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

ఏఒక్కరూ అనారోగ్యం కారణంగా అప్పుల పాలవ్వరాదనే లక్ష్యంతో ప్రభుత్వ వైద్యులు బాధ్యతాయుతంగా వైద్య సేవలు అందించాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. గురువారం స్థానిక త్యాగరాజు కళ్యాణ మండపంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖల అధికారులు, సిబ్బందితో నిర్వహించిన సమీక్షా సమావేశానికి ఆమె అధ్యక్షత వహించారు. మండలాలవారీగా శాఖల పనితీరు సమీక్షించారు. లక్ష్యాలు చేరని మండలాల సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వచ్చే నెలలో జరిగే సమావేశంలో లక్ష్యాలు పూర్తి చేయాలని, అలా చేయని వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ గర్భిణులకు పౌష్టికాహారం అందిస్తే ఆరోగ్యవంతమైన శిశువులు జన్మిస్తారన్నారు. ప్రతి పిహెచ్‌సిలో ప్రతినెలా ఐదు డెలివరీలు, మూడు వేల అవుట్ పేషెంట్లు, ఇన్ పేషెంట్లను మరింత పెంచాలన్నారు. టార్గెట్స్ ఇంత తక్కువగా ఉన్నా పూర్తి చేయలేకపోవడం సిగ్గు పడాల్సిన అంశమన్నారు. నమ్మకం, అవగాహన కల్పిస్తే ప్రభుత్వ ఆసుపత్రులకు డెలివరీలు, అవుట్, ఇన్ పేషెంట్ల సంఖ్య పెరుగుతుందన్నారు. మూడేళ్లు నిండిన ప్రతి చిన్నారిని అంగన్వాడీ కేంద్రంలో చేర్పించి విద్యాబుద్ధులతో పాటు ఆటపాటలను కూడా నేర్పించాలన్నారు. ప్రభుత్వాసుపత్రులకు నిరుపేద, మధ్యతరగతి కుటుంబాల ప్రజలు మాత్రమే వైద్య సేవలు కోసం వస్తారని, ఆప్యాయంగా పలకరిస్తే వారికి సగం జబ్బు నయమవుతుందని అన్నారు. మళ్లీ వారు వైద్య సేవలకు ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే అవకాశం ఉంటుందన్నారు. వైద్యాధికారులు, సిబ్బంది స్థానికంగా నివాసం ఉండాలన్నారు. సమావేశంలో డిఎంహెచ్ఒ డాక్టర్ డి.మహేశ్వరరావు, ఐసిడిఎస్ జిల్లా అధికారి బి.సుజాతారాణి, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ దేవ సుధాలక్ష్మి, జిల్లా ఇన్‌ఛార్జి మలేరియా అధికారి డాక్టర్ ఎం.గులాబ్‌రాజకుమార్, ఎన్‌టిఆర్ వైద్య సేవల కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్.కీర్తికిరణ్, వైద్యాధికారులు, అంగన్వాడీ సిడిపిఒలు, సూపర్‌వైజర్లు, జిల్లా ప్రజారోగ్య నర్సింగ్ అధికారి జి.వెంకటరత్నం, జిల్లా ప్రోగ్రామ్ అధికారి సిహెచ్.ధనలక్ష్మి, జిల్లా హెల్త్ ఎడ్యుకేటర్ వివిఎస్ఆర్.కళ్యాణి కుమారి తదితరులు పాల్గొన్నారు.

అపార్ వేగవంతం చేయాలి

విద్యా శాఖాధికారులకు కలెక్టర్ ఆదేశం

అపార్ నమోదు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లో మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడిఒలు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ, వార్డు అడ్మిన్ సెక్రటరీలతో గూగుల్‌మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఒకటో సంవత్సరం నుండి అంగన్వాడీ పిల్లలు, పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, ప్రయివేట్ పాఠశాలలు అపార్ ప్రక్రియ నమోదును నాలుగు రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. నమోదు ప్రక్రియలో వెనుకబడితే చర్యలు తప్పవన్నారు. జిల్లాలో 2.47 లక్షల మంది బ్యాంకు ఖాతాలు కలిగి ఉండగా ఇప్పటివరకు 83 వేల మందికి మాత్రమే ఎన్‌పిసిఐ బ్యాంకు ఖాతాకు అనుసంధానమైందని, ఇంకా 1.65 లక్షల మంది బ్యాంకు ఖాతాలకు అనుసంధానం చేయాల్సి ఉందని తెలిపారు. ప్రజలు బ్యాంకులకు వచ్చి ఎన్‌పిసిఐ అనుసంధానం చేసుకునేలాచర్యలు తీసుకోవాలని సూచించారు. బ్యాంకర్లు కూడా పూర్తి సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా గ్రామ, వార్డు సచివాలయ అధికారి వై.దోసిరెడ్డి, జిల్లా లీడ్‌బ్యాంక్ మేనేజర్ ఎ.నాగేంద్రప్రసాద్, జిల్లా పంచాయతీ అధికారి వి.అరుణశ్రీ పాల్గొన్నారు.

కార్మికులకు ఉపాధి కల్పించాలి

సిఐటియు ఆధ్వర్యాన తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా



తహశీల్దార్‌కు వినతిని అందజేస్తున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి - పెనుగొండ

గ్రామాల్లో పనులకు ఇబ్బంది పడుతున్న ప్రజలకు ఉపాధి కల్పించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో పెనుగొండ తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి తహశీల్దార్ బి.అనిత కుమారికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు షేక్ పాదుషా మాట్లాడుతూ గత రెండు రోజులుగా నడిపూడి ఇసుక రేవు నుంచి యంత్రాల ద్వారా 30 నుంచి 40 టన్నుల కెపాసిటీ గల లారీల ద్వారా ఇసుకను తరలించడం వల్ల స్థానిక కార్మికులకు పనిలేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. సుబ్రహ్మణ్యేశ్వర ఇసుక జట్టు కార్మిక సంఘంలో సుమారు 300 మంది కార్మికులు ఉన్నారన్నారు. కార్మికులు మాకు పని చూపించాలని అడిగిన సందర్భంలో ఆచంట ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ ఏర్పాటు చేసిన సమావేశంలో ఇసుక లోడింగ్ ఛార్జి అన్ని రేవుల కంటే రూ.100 తగ్గించి సరఫరా చేస్తానని, పని కావలసిన కార్మికులందరూ వచ్చి పని చేసుకోవచ్చు అని ప్రకటించారు. కానీ స్థానిక నాయకులు కార్మికులకు పని కల్పించే విషయంలో అడ్డుపడటంతో పనిలేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై పెనుగొండ తహశీల్దార్ వారిని కలిసి స్థానిక జట్టు కార్మికులకు పని కల్పించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు మాదాసు నాగేశ్వరరావు, శ్రీసుబ్రహ్మణ్యేశ్వర ఇసుక కార్మికుల సొసైటీ సంఘం అధ్యక్షులు రేలంగి సుబ్రహ్మణ్యం, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా మత్స్యకార దినోత్సవం



భీమవరం టౌన్ : మత్స్యకార దినోత్సవంలో పాల్గొన్న మత్స్యకారులు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ఎన్ని ప్రభుత్వాలు మారినా మత్స్యకార కార్మికుల జీవితాలు మారటం లేదని సంఘ నాయకులు విమర్శించారు. గురువారం మత్స్యకార సంఘ నాయకులు ఆధ్వర్యాన ప్రపంచ మత్స్యకార దినోత్సవం సందర్భంగా మండలంలోని తోకతిప్ప గ్రామంలో సొసైటీ అధ్యక్షులు తిరుమాని శ్రీనివాసరావు మత్స్యకార జెండాను ఎగరవేశారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షులుగా తిరుమాణి నాగేశ్వరరావు వ్యవహరించారు. ఆంధ్రప్రదేశ్ మత్స్యకారులు, మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొల్లాటి శ్రీనివాసరావు మత్స్యకారులనుద్దేశించి మాట్లాడుతూ ప్రభుత్వాలు మారుతున్నా మత్స్యకారుల జీవన ప్రామాణాలు మారట్లేదన్నారు. తమ సంఘం ఎన్నో పోరాటాలు చేసి సాధించిన వేట నిషేధ భృతి, 50 సంవత్సరాల పెన్షన్ సాధించామని, మత్స్యకారులకి వేట నిషేధ కాలంలో రూ.20 వేల నగదు ఇస్తామని వాగ్దానం చేసి నేటికీ ఇవ్వలేదన్నారు. మత్స్యకారులకు వలలు, బోట్లు, సాంప్రదాయ భృతిని అమలు చేయాలని, మత్స్యకారులకు ఇన్‌లాండ్ సొసైటీల ద్వారా వడ్డీ లేని రుణాలు అందించాలని, సొసైటీలు పరిపుష్టి చేసి సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. చేపల మార్కెట్లలో మహిళలకు టాయిలెట్స్ ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలని, మత్స్యకారుల చదువుకున్న బిడ్డలకు వ్యాపారాలు చేసుకునేందుకు రూ.ఐదు లక్షలు వడ్డీ లేని రుణాలు ఎన్ఎఫ్‌డిబి ద్వారా అందించాలని అన్నారు. రాష్ట్ర బడ్జెట్లో రూ.5 వేల కోట్లు కేటాయించాలని, వలలు, బోట్లు ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక మత్స్యకారులతో పాటు ఆంధ్రప్రదేశ్ మత్స్యకారులు, మత్స్యకార్మిక సంఘం పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి జల్లి రాముమోహాన్, జిల్లా కమిటీ సభ్యులు ఒడుగు శ్రీనివాసరావు, ఇంజెటి శ్రీనివాసరావు, తిరుమాని సత్యనారాయణ, తానేటి రవి, తిరుమాని సూర్యనారాయణ, నాయకులు పాల్గొని జయప్రదం చేశారు.

నరసాపురం : మత్స్యకారులు తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించాలని, జీవన ప్రమాణాలు పెంచుకోవాలని నరసాపురం ఆర్‌డిఒ దాసిరాజు అన్నారు. బుధవారం పట్టణంలోని అంబేడ్కర్ భవన్‌లో జిల్లా మత్స్యశాఖ ఆధ్వర్యంలో ప్రపంచ మత్స్యకార దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆర్‌డిఒ మాట్లాడుతూ మత్స్యకారుల వృత్తి ఎంతో సాహసంతో కూడుకుందన్నారు. ఎంతో కష్ట సాధ్యమైన వేట ద్వారా సముద్ర ఉత్పత్తులను తీసుకురావడం జరుగుతుందని చెప్పారు. ప్రభుత్వం నుంచి అందుతున్న పథకాలను మత్స్యకారులు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. జిల్లా మత్స్యశాఖ అధికారి ఆర్‌విఎస్ ప్రసాద్ మాట్లాడుతూ మత్స్యకారులు సముద్రంలో వేట సాగించే క్రమంలో మత్స్యసంపద నశించిపోకుండా చూడాలన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలను పాటించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మత్స్య సహకార సంఘాల ఉత్తమ అధ్యక్షులుగా తిరుమాని మహాలక్ష్మి, బేరం శ్రీరామచంద్రమూర్తిలను ఎంపిక చేసి సత్కరించారు. ఆక్వా సాగులో అత్యుత్తమ ప్రతిభ కనపరచిన గొట్టుముక్కల గాంధీ, భగవాన్ రాజుని మెమెంటోతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ అధికారులు, మత్స్యకార సంఘాల నాయకులు పాల్గొన్నారు.



నరసాపురం : మాట్లాడుతున్న ప్రసాద్

మంచి వ్యవసాయ పద్ధతులతో రెట్టింపు ఆదాయం

వ్యవసాయ సహాయ సంచాలకులు శ్రీనివాసరావు



జిఎపి పొలంబడిని సందర్శిస్తున్న అధికారులు

ప్రజాశక్తి - ఉండి

మంచి వ్యవసాయ పద్ధతులు(గుడ్ అగ్రికల్చర్ ప్రాక్టీసెస్-గ్యాప్) సర్టిఫికేషన్ రైతులకు రెట్టింపు కంటే ఎక్కువ ఆదాయాన్ని తెచ్చిపెడుతోందని ఆకివీడు సబ్ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు కెఎఎస్ఎస్.శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం ఉండి మండలం యండగండి గ్రామంలో మండల వ్యవసాయాధికారి బి.సంధ్య ఆధ్వర్యంలో నిర్వహించిన జిఎపి పొలంబడి కార్యక్రమంలో పాల్గొన్న శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉత్తమ యాజమాన్య పద్ధతులు పాటిస్తూ పండించిన పంటలకు మార్కెట్‌లో ప్రీమియం ధర లభిస్తోందన్నారు. పంట ఉత్పత్తుల్ని నచ్చినచోట నచ్చిన వారికి అమ్ముకునే వెసులుబాటు లభించడంతో రైతుల ఆనందం అవధులు దాటుతోందని వారు తెలిపారు. సమగ్ర పంట నిర్వహణ పద్ధతుల్ని పాటించడం ద్వారా సాగు వ్యయాన్ని నియంత్రిస్తూ నాణ్యమైన ఉత్పాదకతను పెంచాలన్న సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ఇందుకోసం పొలం బడులు, తోట బడులను నిర్వహిస్తూ ఉత్తమ యాజమాన్య పద్ధతుల్ని రైతుల ముంగిటకు చేరుస్తోందన్నారు. ఫలితంగా సాగు వ్యయం 6 నుంచి 17 శాతం ఆదా అవుతుండగా దిగుబడులు 9 నుంచి 20 శాతం పెరిగి రైతులకు గణనీయమైన ఆదాయాన్ని ఇస్తోందని వారు వివరించారు. యండగండి గ్రామంలోని ఉత్తమ రైతు ఇందుకూరి వెంకట నరసింహారాజు జిఎపి పొలంబడి క్షేత్రంలో పంట కోత ప్రయోగం నిర్వహించి, నమూనాను సేకరించి జిఎపి సర్టిఫికేషన్‌కు పంపించడమైందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, ఎఇఒలు, క్లస్టర్ పొలంబడి రైతులు పాల్గొన్నారు.

నాస్కం ఫౌండేషన్‌తో ఎస్ఆర్‌కెఆర్ ఎంఒయు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

విద్యార్థుల వినూత్న ఆలోచనలను స్టార్టప్‌లుగా మార్చేందుకు, సాంకేతిక సహాయం పొందేందుకు నాస్కం ఫౌండేషన్‌తో ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాల ఎంఒయు కుదుర్చుకుంది. ఇందుకు సంబంధించిన పత్రాలను నాస్కం ఫౌండేషన్ ఇన్నోవేషన్ మేనేజర్ ఆల్బర్ట్ డైలాన్ కొర్రియా, ఎస్ఆర్‌కెఆర్ ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ డాక్టర్ బిహెచ్‌విఎస్ రామకృష్ణంరాజు మార్చుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.జగపతి రాజు మాట్లాడుతూ నాస్కం ఫౌండేషన్‌తో ఎంఒయు వల్ల విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించి ఉన్నతమైన పరిశోధనాత్మక ఆలోచనలు వాస్తవ రూపంలో తీసుకువచ్చేందుకు, స్టార్టప్‌లు పెట్టేందుకు ఇది ఎంతగానో దోహదపడుతుందన్నారు. వీటితో పాటు హేక్తాన్ వంటి కార్యక్రమాలకు కూడా మంచి సూచనలు, సలహాలు ఈ ఎంఒయు ద్వారా విద్యార్థులకు అందుతాయన్నారు. నూతన విద్యా విధానంలో స్టార్టప్‌లకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారని ఆయన గుర్తు చేశారు. విద్యార్థులను ప్రోత్సహించేందుకు అందుకు కావలసిన వసతులను కళాశాల యాజమాన్యం అందిస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కళాశాల డీన్ అకాడమిక్స్ డాక్టర్ వి.చంద్రశేఖర్, కళాశాల కార్పొరేట్ రిలేషన్స్ మేనేజర్ అశోక్ రెడ్డి పాల్గొన్నారు.

తీరప్రాంతాల్లో 'సీ విజిల్'

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం నియోజకవర్గ పరిధిలోని సముద్ర, గోదావరి తీరాల్లో గురువారం సివిల్, మెరైన్, కోస్ట ఆధ్వర్యంలో సీ విజిల్ కార్యక్రమం నిర్వహించారు. ముష్కరులు దేశంలో చొరబడినప్పుడు తీర ప్రాంతాల్లో రక్షణ సన్నద్ధత ఏవిధంగా ఉందో తెలియజేసేలా ఇది సాగింది. నరసాపురం పట్టణం బస్‌స్టాండ్, రైల్వే స్టేషన్, పంటిరేవు, ఒఎన్‌జిసి టెంపుల్ ల్యాండ్, ప్రభుత్వ ఆసుపత్రి, నరసాపురం, మొగల్తూరు సముద్ర తీరం వరకు సీ విజిల్ సాగింది. సముద్రంలో చేపల వేట నుంచి బయటకు వచ్చే మత్స్యకారులను, బీచ్‌కు వచ్చే సందర్శకులను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో నరసాపురం రూరల్ సిఐ జి.దుర్గా ప్రసాద్, అంతర్వేది మైరెన్ ఎస్ఐ సోమశేఖర్, రూరల్ ఎస్ఐ టి.వెంకట సురేష్, మొగల్తూరు ఎస్ఐ వై.నాగలక్ష్మి పాల్గొన్నారు.



బీచ్‌లో తనిఖీ చేస్తున్న సీ విజిల్ టీం

సాఫ్ట్‌వేర్ డెవలపర్‌గా ఎస్‌కెఎస్‌డి విద్యార్థిని

ప్రజాశక్తి - తణుకు

ఎస్‌కెఎస్‌డి మహిళా కళాశాల డిగ్రీ, పిజి(అటానమస్) విద్యార్థిని రాయుడు దానేశ్వరి ప్రముఖ ఎంఎన్‌సి కంపెనీ అక్సెంచర్‌లో సాఫ్ట్‌వేర్ డెవలపర్‌గా ఎంపికైందని కళాశాల ప్రిన్సిపల్ కెప్టెన్ యు.లక్ష్మీసుందరీబాయి తెలియజేశారు. ఈ సందర్భంగా లక్ష్మీసుందరీబాయి మాట్లాడుతూ ఈనెల 23వ తేదీ నుంచి విధులు నిర్వహిస్తారని తెలియజేశారు. ఎంపికైన విద్యార్థినిని కళాశాల జాయింట్ సెక్రెటరీ చిట్టూరి వెంకటకృష్ణారావు, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ జి.హరిప్రసాద్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినులు అభినందించారు.


విద్యార్థినిని అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్స్ పంపిణీ

ప్రజాశక్తి - పాలకొల్లు

విద్యార్థులు క్రీడలలో ప్రత్యేక ఆసక్తి కలిగి ఉండాలని పాలకొల్లు ఫెమినా లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు మాచేపల్లి ఉమ అన్నారు. క్రీడలలో పాల్గొనడం ద్వారా విద్యార్థుల శారీరక దారుఢ్యం మెరుగు పరుచుకోవచ్చని ఆమె సూచించారు. గురువారం జిబిఎంసి ఆర్‌ఎం మున్సిపల్ పాఠశాలలో ఫెమినా క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్స్ పంపిణీ చేసే కార్యక్రమం హెచ్‌ఎం రాయపూడి భవానీ ప్రసాద్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో ఉమ మాట్లాడుతూ పాఠశాలను సుందరంగా తీర్చిదిద్దడం చాలా ఆనందంగా ఉందని, పాఠశాల విద్యార్థులలో ప్రతిభా పాటవాలను పెంపొందించేలా అవిరళ కృషిచేస్తున్న పాఠశాల హెచ్‌ఎంకు కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు రాయపూడి మాస్టార్‌కు రుణపడి ఉంటారని అన్నారు. విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్స్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో సెక్రెటరీ ఇమ్మిడి లలిత, క్లబ్ సభ్యులు నంబూరి భాగ్యలక్ష్మి, కంచర్ల సుశీల పాల్గొన్నారు.

ఎస్‌సి వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధం

సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన

ప్రజాశక్తి - నరసాపురం

ఎస్‌సి వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమని, ఎస్‌సి వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పును రద్దుచేయాలని కోరుతూ నరసాపురం సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద నరసాపురం నియోజకవర్గ మాలల న్యాయ పోరాట సమితి ఆధ్వర్యంలో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా నరసాపురం నియోజకవర్గ ఎస్‌సి మాల న్యాయ పోరాట సమితి అధ్యక్షుడు సోడదాసి శ్రీధర్ మాట్లాడుతూ ఎస్‌సి వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన రాజీవ్ రంజన్ మిశ్రా, ఏకసభ్య కమిషన్ వెంటనే రద్దు చేయాలన్నారు. రాష్ట్రంలో వెంటనే కులగణన చేపట్టాలని కోరారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయ సిబ్బందికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వర్షపు ఏసురత్నం, నరసాపురం ఎంపిపి మైలాబత్తుల సోనీ, కౌన్సిలర్ జిల్లెల్ల దిలీప్, ఆడిదల శరత్, మాజీ ఎంఎంసి చైర్మన్ దొండపాటి స్వామి, మైల బత్తుల శ్రీను, నల్లి బుల్లిరాజు, గోరింకల విజయ్, నల్లి రాజేష్ పాల్గొన్నారు.

పిఎఫ్ సొమ్ము అవకతవకలపై విచారించాలి : ఎఐటియుసి

ప్రజాశక్తి - తణుకు

తణుకు జిల్లా కేంద్ర ఆసుపత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్టు పారిశుధ్య కార్మికుల పిఎఫ్ సొమ్ము అవకతవకలపై సమగ్ర విచారణ జరిపించి, కార్మికులకు న్యాయం చేయాలని ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు, ఎపి మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ తణుకు శాఖ అధ్యక్షులు కోనాల భీమారావు డిమాండ్ చేశారు. గురువారం తణుకు జిల్లా కేంద్ర ఆసుపత్రి వద్ద కాంట్రాక్టు పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ధర్నా నిర్వహించారు. అనంతరం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెలగల అరుణకు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా భీమారావు మాట్లాడుతూ ఆసుపత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల పిఎఫ్ సొమ్ము సంవత్సరంగా వారి ఖాతాలో జమ కావడం లేదన్నారు. సంబంధిత కాంట్రాక్టర్ దృష్టికి ఎన్నిసార్లు తీసుకువెళ్లినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదన్నారు. కాంట్రాక్టర్ కార్మికుల ఖాతాల్లో పిఎఫ్ సొమ్ము జమ చేస్తున్నామని చెబుతున్నారని, వాస్తవానికి సొమ్ము కార్మికుల పిఎఫ్ ఖాతాల్లో జమ కావడం లేదన్నారు. ప్రభుత్వాధికారులు పిఎఫ్ సొమ్ము అవకతవకలపై నిగ్గు తేల్చాలని భీమారావు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ తణుకు శాఖ కార్యదర్శి పుష్పలత, ఎస్.వెంకటలక్ష్మి, జి.రత్నం, పి.విజయలక్ష్మి, నేకూరి లక్ష్మి, ఎన్.చింతాలు, డి.ప్రసన్నకుమారి పాల్గొన్నారు.

క్షీరా రామలింగేశ్వర స్వామి ఆలయ ఇఒగా శ్రీనివాస్

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు శ్రీక్షీరా రామలింగేశ్వర స్వామి వారి దేవస్థానం కార్యనిర్వహణాధికారిగా దేవాదాయ శాఖ జెఇఒ విల్లి పల్లపురాజు సందర్శించారు. ఆలయంలో బంగారం, వెండి వస్తువులను పరిశీలించి యాళ్ల సూర్యనారాయణ నుంచి పూర్తి బాధ్యతలను ప్రస్తుత ఇఒ ముచ్చర్ల శ్రీనివాసరావుకి అప్పగించారు.


బంగారం, వెండి వస్తువులను పరిశీలిస్తున్న జెఇఒ

నేరాలు - ఘోరాలు


మాట్లాడుతున్న డిఎస్‌పి శ్రీవేద

నిందితుడికి 14 రోజుల రిమాండ్

డిఎస్‌పి డాక్టర్ శ్రీవేద

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఇటీవల నమోదైన పోక్సో కేసులో ముద్దాయిని అరెస్టు చేసినట్లు డిఎస్‌పి డాక్టర్ జి.శ్రీవేద తెలిపారు. గురువారం నరసాపురం డిఎస్‌పి కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణానికి చెందిన చింతా నరసింహస్వామి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆడపిల్లను ప్రేమిస్తున్నానని మాయమాటలు చెప్పి ఆ బాలికతో అసభ్యకరంగా ప్రవర్తించి, ఆమె వద్ద నుంచి బంగారం, డబ్బును తీసుకుని వాటితో జల్సా చేశారన్నారు. జిల్లా ఎస్‌పి ఆదేశాల మేరకు కేసును దర్యాప్తు చేసి గురువారం కోర్టులో హాజరు పరచగా కోర్టు ముద్దాయికి 14 రోజులు రిమాండ్ విధించిందన్నారు. ఎవరైనా మహిళలు, ఆడ పిల్లల పట్ల అసభ్యంగా ప్రవర్తించినా, ప్రేమిస్తానని మోసం చేసినా వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని డిఎస్‌పి హెచ్చరించారు. ఇటువంటి వారి పట్ల మహిళలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రూరల్ సిఐ జి.దుర్గాప్రసాద్, టి.వెంకట సురేష్, ఎఎస్ఐలు కె.సత్యనారాయణ, వంపన శ్రీనివాస్, భాస్కర్‌రావు, హెచ్‌సి వర్మ పాల్గొన్నారు.

బెల్ట్‌షాప్ నిర్వాహకుని అరెస్టు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

వేర్వేరు ప్రదేశాలలో దాడులు నిర్వహించి బెల్ట్ షాప్ నిర్వహిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు తాడేపల్లిగూడెం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సిఐ కె.ఎస్.కళ్యాణ్ చక్రవర్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తాడేపల్లిగూడెం ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ మురళీమోహన్, దొరబాబు, సిబ్బందితో కలిసి మండలంలోని కొమ్ముగూడెం గ్రామంలో బెల్ట్‌షాప్ నిర్వహిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి 10 డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలను స్వాధీనపరచుకుని, కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సిఐ తెలిపారు. బెల్ట్ షాపులు గురించి ఎవరైనా సమాచారం ఉంటే తాడేపల్లిగూడెం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ సెల్ నెంబర్ 9440902433కు తెలియజేయాలని సూచించారు.

వికలాంగులకు పండ్లు, దుప్పట్ల పంపిణీ అభినందనీయం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

అన్ని దానాలలో కెల్లా అన్నదానం, సేవా దానం ఎంతో గొప్పవని అంధులకు, వికలాంగులకు కార్తీక వన సమారాధన ఏర్పాటు చేసి వారికి పండ్లు, దుప్పట్లు పంపిణీ చేయడం అభినందనీయమని ఆలయ ఇఒ డి.రామకృష్ణంరాజు అన్నారు. గురువారం కార్తీక మాసాన్ని పురస్కరించుకుని పంచారామక్షేత్రమైన భీమవరం శ్రీఉమా సోమేశ్వర జనార్ధన స్వామి దేవస్థానంలో పురోహితులు ఘంటసాల సోమేశ్వర శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, లక్ష బిల్వార్చన నిర్వహించారు. సోమేశ్వర శర్మ మాట్లాడుతూ ప్రతి ఏడాది కార్తీక మాసంలో శ్రీవేంకటేశ్వర బధిర పాఠశాల, రమణరాజు అంధ పాఠశాల, వికలాంగుల విద్యార్థులకు స్వామివారి దర్శనం కల్పించి, ఉచితంగా దుప్పట్లు, పండ్లు, స్వీట్స్, బిస్కెట్స్, శానిటరీ, కార్తీక అన్నదానం చేయిస్తున్నామని అన్నారు. సేవా కార్యక్రమాలు చేయడంతోనే ఎంతో సంతృప్తి కలుగుతుందని తెలిపారు. అనంతరం 300 మంది బధిర, అంధ, వికలాంగ విద్యార్థులకు పండ్లు, దుప్పట్లు, స్వీట్స్ పంపిణీ చేశారు. అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు కందుకూరి సోంబాబు, చెరుకూరి రామకృష్ణ, అర్చకులు పాల్గొన్నారు.

నేడు అన్ని పంచాయతీల్లో జాబ్ కార్డ్ గ్రామసభలు

ప్రజాశక్తి - పెనుమంట్ర

ఈనెల 22వ తేదీ శుక్రవారం ఉపాధి హామీ చట్టంకు సంబంధించి చనిపోయిన వారి పేర్లను జాబ్ కార్డు నుంచి తొలగించుటకు, కొత్తగా జాబ్ కార్డులు కావలసిన వారిని గుర్తించుటకు అన్ని గ్రామ పంచాయతీలలో గ్రామ సభలు జరుగుతాయని స్థానిక మండల పరిషత్ ఎంపిడిఒ బివిఎస్‌వి.శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. కమిషనర్ వారి ఆదేశాల ప్రకారం నిర్వహిస్తున్న ఈ గ్రామ సభల్లో పాల్గొనాలని ఆయన కోరారు.

సిపిఎం మండల కార్యదర్శిగా మోహన్‌రావు

ప్రజాశక్తి - ఆచంట



ఆచంటలో ప్రయాణికుల సౌకర్యార్థం బస్టాండ్ నిర్మించాలని, డంపింగ్ యార్డ్‌కు స్థల సేకరణ చేపట్టాలని, శ్మశాన వాటిక సమస్యలను పరిష్కరించి, శ్మశానాలను ఆధునీకరించాలని సిపిఎం మండల మహాసభ తీర్మానించింది. సిపిఎం ఎనిమిదవ మండల మహాసభ గురువారం నిర్వహించారు. మండల కార్యదర్శిగా పరువు మోహన్ రావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కేతా గోపాలన్ తెలిపారు. ఈ సందర్భంగా మండల సమస్యలపై పలు తీర్మానాలు చేశారు. వర్షాలు, వరదల కారణంగా ప్రతియేటా ముంపుకు గురవుతున్న నక్కల, తాడేరు డ్రెయిన్‌లను ఆధునీకరించాలని, నియోజకవర్గ కేంద్రమైన ఆచంటలో ప్రతి ఏటా అగ్ని ప్రమాదాలు సంభవించి భారీ నష్టం జరుగుతుందని, తక్షణమే అగ్నిమాపక కేంద్రాన్ని, అయోధ్య లంక గ్రామస్తులకు వారధి నిర్మాణం చేపట్టాలన్నారు. నియోజకవర్గ కేంద్రంలో శాశ్వత డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని, వివిధ సామాజిక తరగతులకు ప్రభుత్వం కేటాయించిన కమ్యూనిటీ భవనాలు అసంతృప్తిగా ఉన్నాయని, తక్షణమే నిర్మాణం పూర్తి చేయాలని, ఆచంట శుక్రవారం మార్కెట్లో శిథిలా వ్యవస్థకు చేరిన షెడ్లను తొలగించి, కొత్త షెడ్లు నిర్మాణం చేపట్టాలని, జిల్లా కేంద్రమైన భీమవరం నుంచి మండల కేంద్రమైన ఆచంట మీదగా రావులపాలెం వరకు ఆర్‌టిసి బస్సు నడపాలని, కొడమంచిలి పంచాయతీ పరిధిలో డ్రెయినేజీ సమస్యను పరిష్కరించాలని కోరుతూ తీర్మానం చేశారు. అనంతరం నూతన మండల కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఎస్‌విఎన్.శర్మ, గుత్తుల రంగారావు, కుసుమే జయరాజు, మచ్చ సుబ్బారావు, సిర్రా నరసింహమూర్తి, తలపూరి బుల్లబ్బాయి, పిల్లి చంటిబాబు, చిలుకూరి శ్రీనివాస్, మట్టపర్తి ఆంజనేయులు మండల కమిటీ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు కేతా గోపాలన్ తెలిపారు.

24న ఉచిత మెడికల్ క్యాంప్

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ఈనెల 24వ తేదీ ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు అల్లూరి సీతారామరాజు, భగత్ సింగ్ సేవా విజ్ఞాన కేంద్రం ట్రస్టు ఛైర్మన్ బి.బలరాం గురువారం తెలిపారు. ఆదివారం ఉదయం 9 గంటల నుంచి బిపి, షుగరు, ఫిట్సు, పెరాలసిస్ పేషెంట్లకు పుచ్చలపల్లి సుందరయ్య భవనం, మెంటేవారితోట, భీమవరంలో ఉచిత మెడికల్ క్యాంప్ నిర్వహిస్తున్నామన్నారు. ఈ క్యాంపు గత రెండు సంవత్సరాలుగా ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రముఖ న్యూరో వైద్య నిపుణులు జిబిఆర్.ఫౌండేషన్ ఛైర్మన్ గోపాలం, శివన్నారాయణ ద్వారా జనరిక్ మెడిసిన్ రూ.300లకే మూడు నెలలకు సరిపడా మందులు ఈ క్యాంపు ద్వారా అందిస్తున్నామన్నారు. బిపి, షుగర్, ఫిట్సు, పెరాలసిస్‌తో బాధపడేవారు ఆదివారం జరిగే ఈ క్యాంపులో పాల్గొని అతి తక్కువ ధరకే మందులను పొందవచ్చని బి.బలరాం సూచించారు. వసుధ ఫౌండేషన్, డెక్కన్ ఫైన్‌కెమికల్స్, ఎస్‌ఎల్‌జి ఆసుపత్రి, జిబిఆర్ ఫౌండేషన్ సహకారంతో అల్లూరి సీతారామరాజు, భగత్‌సింగ్ సేవా విజ్ఞాన కేంద్రం ఈ క్యాంపు నిర్వహిస్తుందన్నారు.

గ్రంథాలయాలను విద్యార్థులు వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - ఆచంట(పోడూరు)

ప్రతిరోజు ఒక గంట పాటు గ్రంథాలయాలలో ఉన్న పుస్తకాలను చదివితే విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారని రిటైర్డ్ ప్రొఫెసర్ ఇందుకూరి మోహన్‌రాజు అన్నారు. 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల బహుమతి ప్రధానోత్సవం స్థానిక పండిత విల్లూరు గ్రంథాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు వి.ప్రియ రామ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాల వినియోగం, వాటి ఆవశ్యకత, నేటి సమాజంలో పుస్తకం వినియోగించడంలో విద్యార్థుల పాత్ర, తదితర విషయాల గురించి అవగాహన కల్పించారు. రిటైర్డ్ ప్రొఫెసర్ ఇందుకూరి మోహన్ రాజు పాల్గొని గ్రంథాలయాలలో చదవడం వల్ల విద్యార్థుల మానసిక నైపుణ్య విలువలను పెంచుకోవచ్చని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆచంట సుబ్బారావు, ఆచంట భాస్కరరావు, నెక్కంటి సుబ్బారాయుడు, నామాల ఫణీంద్ర, గ్రంథ పాలకుడు కట్ట కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

పాలకోడేరు : గ్రంథాలయాల్లో చదివి ఎందరో ఉన్నత శిఖరాలు అవరోధించారని మండల విద్యాశాఖాధికారి ఎంవిఎన్.శ్రీమన్నారాయణ అన్నారు. గొల్లలకోడేరు శాఖ గ్రంథాలయంలో వారం రోజుల నుంచి నిర్వహిస్తున్న 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు గురువారంతో ముగిసాయి. దీనిలో భాగంగా నిర్వహించిన వివిధ పోటీలకు మండల విద్యాశాఖ అధికారి చేతుల మీదుగా విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాల్లో రోజూ చదవడం ద్వారా విజ్ఞానం పెరుగుతుందన్నారు. ప్రపంచంలో జరిగే ప్రతి విషయం తెలుసుకునేందుకు వీలుగా ఉంటుందన్నారు. ఎంతోమంది ఉన్నత స్థానాల్లో ఉన్నారంటే దానికి గ్రంథాలయాలు మూలమని చెప్పారు. గొల్లలకోడేరు గ్రంథాలయాధికారి జి.బాలరాజు మాట్లాడుతూ వారం రోజుల పాటు విద్యార్థుల మేథస్సును పెంపొందించే విధంగా అటు చదువులోను, ఇటు ఆటల్లోనూ వివిధ పోటీలు నిర్వహించడం జరిగిందన్నారు. విజేతలుగా నిలిచిన ప్రతి ఒక్కరికి బహుమతులు అందించామన్నారు. విద్యార్థులు విద్యలో రాణించడానికి గ్రంథాలయాలు ఎంతో దోహదపడతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆయుర్వేద హాస్పిటల్ వైద్యులు డాక్టర్ శ్రీరామ్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.సూర్య నారాయణ రాజు, రిటైర్డ్ వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు



పాలకొల్లు : సర్టిఫికెట్, మెమొంటోలతో విద్యార్థులు



పాలకోడేరు : బహుమతి అందుకుంటున్న విద్యార్థి

పాలకొల్లు : విద్యార్థులు గ్రంథాలయాలను ఉపయోగించుకొని పోటీ పరీక్షల్లో విజయం సాధించాలని పాలకొల్లు తహశీల్దార్ యడ్ల దుర్గా కిషోర్ కోరారు. గురువారం స్థానిక శాఖ గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఆయన సొంత ఖర్చుతో బహుమతి ప్రధానం చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మాట్లాడుతూ తాను తహశీల్దార్ ఉద్యోగం సంపాదించడానికి గ్రంథాలయాలను ఉపయోగించుకోవడమే కారణమన్నారు. సభాధ్యక్షులు లైబ్రేరియన్ వర్ధనపు శాంతి కుమారి నివేదిక సమర్పిస్తూ 40 సంవత్సరాలుగా అద్దె భవనంలో శాఖ గ్రంథాలయం నడుస్తోందని, ప్రభుత్వం స్థలం కేటాయిస్తే సొంత భవనం నిర్మాణం చేయిస్తామని చెప్పారు. రిటైర్డ్ ఎస్‌బిఐ అధికారి వివిఎస్‌ఎన్.మూర్తి గీతాలాపన చేశారు. పప్పొపు విజయలక్ష్మి, కవులు కోలాటి పెద్దిరాజు, చేగొండి రంగారావు, కొల్లాబత్తుల సూర్య కుమార్, రిటైర్డ్ ఎంఇఒ యర్రా అజయ్ కుమార్, మాడభూషి కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు.


తాడేపల్లిగూడెం : బహుమతి అందుకుంటున్న విద్యార్థి

తాడేపల్లిగూడెం : ఆదిత్య డిగ్రీ కళాశాలలో 57వ గ్రంథాలయ వారోత్సవాలు గురువారం ఘనంగా ముగిసినట్లు కళాశాల ప్రిన్సిపల్ పి.లక్ష్మీ సరోజ తెలిపారు. వారం రోజుల పాటు విద్యార్థులకు పోటీలు నిర్వహించి, గురువారం పుస్తక ప్రదర్శన నిర్వహించినట్లు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యార్థులకు చిత్రలేఖనం, వక్తృత్వం, వ్యాసరచన, లోగో డిజైన్(గేయుట), గ్రూప్ డిస్కషన్ మొదలగు పోటీలు నిర్వహించడం ద్వారా విద్యార్థులలో నైపుణ్యత వెలికి తీయవచ్చని తెలిపారు. తమ గ్రంథాలయంలో 4,800 పుస్తకాలు ఉన్నాయని, వాటిని విద్యార్థులు వినియోగించుట ద్వారా తగిన నైపుణ్యాన్ని పొందవచ్చు అన్నారు. కళాశాల డైరెక్టర్ కె.శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఆదిత్య డిగ్రీ కళాశాలలో చదువుతోపాటు అన్ని నైపుణ్యాలు వెలికి తీసేలా తమ ప్రణాళిక ఉంటుందని, అదేవిధంగా ఉపాధ్యాయులకు, విద్యార్థులకు బెస్ట్ లైబ్రరీ యూజర్, బెస్ట్ రీడర్ అవార్డు ప్రతినెల ఇవ్వడం జరుగుతుందన్నారు. విజేతలకు డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి బహుమతులు అందజేశారు. పెంటపాడు గ్రంథాలయ శాఖ అధికారి మహమ్మద్ అలీ, కళాశాల గ్రంథాలయాధికారి కె.రూపా దేవి, సిబ్బంది పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలకు 22న క్షేత్రస్థాయి పరిశీలన

నరసాపురం : ప్రభుత్వ ఆదేశాల మేరకు గృహ నిర్మాణాలకు అర్హులైన లబ్ధిదారుల ఎంపికకు సంబంధించి ఈనెల 22 నుంచి క్షేత్ర స్థాయిలో నిర్వహించనున్న సర్వే పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా చేపట్టాలని గృహ నిర్మాణ శాఖ ఇన్‌ఛార్జి ఇఇ పి.వెంకటేశ్వరరావు అన్నారు. గృహ నిర్మాణ సంస్థ కార్యాలయంలో గ్రామ సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో గురువారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటి వరకు సొంత ఇల్లు, ప్రభుత్వంచే నిర్మించిన ఇళ్లకు సంబంధించిన లబ్ధిదారులు కాకుండా ఇప్పటి వరకు ఇల్లు లేని లబ్ధిదారులను ఎంపిక చేయాలన్న వారికి సంబంధించిన కుటుంబాల పూర్తి వివరాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి, గృహ నిర్మాణ శాఖకు సంబంధించిన యాప్ అప్లోడ్ చేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో గృహాలు మంజూరు చేసేందుకు ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను ఆయన ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో గృహ నిర్మాణ శాఖ మండల ఎఇఇ ఎంఎన్.రవీంద్ర పాల్గొన్నారు.

ఆధార్ అప్డేట్ క్యాంపును వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

మండలంలోని 11వ వార్డు గుణ్ణం వారి వీధి, 15వ వార్డు బిఆర్ మార్కెట్, 2, 18వ వార్డు ఎస్‌వి కాలనీ, 32వ వార్డు కడకట్లలో ఆధార్ స్పెషల్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎం.యేసు బాబు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ ఆధార్ కేంద్రాలలో పేరు సవరణలు, పుట్టిన తేదీ సవరణలు, మొబైల్ నెంబర్ అప్డేషన్, ఆధార్ అప్డేషన్ చేయబడునని తెలిపారు. కావున ఈ అవకాశాన్ని పట్టణ ప్రజలు వినియోగించుకొని, తమ ఆధార్ కార్డులలో సవరణలు చేసుకోవలసిందిగా మున్సిపల్ కమిషనర్ తెలిపారు.

ఘనంగా కార్తీక వనసమారాధన

ప్రజాశక్తి - కాళ్ల

కార్తీకమాసంలో నిర్వహించే కార్తీక వనసమారాధన కార్యక్రమాలు ప్రజల్లో ఐకమత్యాన్ని పెంపొందించడానికి దోహదపడతాయని ఆలయ ఇఒ మోకా అరుణ్ కుమార్ పేర్కొన్నారు. కార్తీక మాసం సందర్భంగా వెంకటేశ్వర స్వామి ఆలయంలోని ఉసిరి చెట్టు వద్ద అన్న సమారాధన గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఇఒ మోకా అరుణ్‌కుమార్ మాట్లాడుతూ దేవాలయ ఆవరణలో వన సమారాధన నిర్వహించడం వల్ల ప్రజల్లో భక్తి భావం, స్నేహ భావం పెరుగుతుందన్నారు. ప్రజలంతా ఐకమత్యంతో ఒకరికొకరు కలసి, మెలసి జీవించడానికి దోహదం చేస్తాయన్నారు. వార్డుల్లో ఉండే ప్రతి వీధి నుంచి మహిళలు, చిన్నారులు, వృద్ధులు తరలివచ్చి స్వామి వారి ప్రసాదాన్ని స్వీకరించారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున యాత్రికులు పాల్గొన్నారు.


మొగల్తూరు : వనసమారాధనలో పాల్గొన్న యాత్రికులు

మొగల్తూరు : మొగల్తూరులోని కోట రోడ్‌లో ఉన్న దత్తసాయి మందిరంలో గురువారం భారీ అన్న సమారాధన నిర్వహించారు. గ్రామానికి చెందిన గుత్తికొండ సత్యనారాయణ, వారి సోదరుల ఆర్థిక సహాయంతో ఏర్పాటు చేసిన అన్న సమారాధనలో అధిక సంఖ్యలో యాత్రికులు పాల్గొన్నారు. ముందుగా యాత్రికులు బాబా వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కానుకలు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. అన్న సమారాధనలో పాల్గొన్న యాత్రికులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

పాలకొల్లు : నవంబర్ 21 ప్రపంచ టెలివిజన్ డే సందర్భంగా జిల్లా టివి మెకానిక్ ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో పాలకొల్లులో గురువారం గవర్నమెంట్ హాస్పిటల్‌లో రోగులకు పళ్లు, వృద్ధాశ్రమంలో వృద్ధులకు రగ్గులు, పళ్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షులు చెరుకూరి దుర్గాప్రసాద్ మాట్లాడుతూ పెద్దలకు, నిరుపేదలకు సాయం చేయడంలో ఎంతో ఆనందం ఉందని చెప్పారు. జిల్లా ఉపాధ్యక్షులు మానెం బసవరాజు మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలు చేయటం వల్ల తదుపరి జనరేషన్ వారికి కూడా సహాయం చేయాలనే ఆలోచన ఏర్పడుతుందన్నారు. చించినాడ బ్రిడ్జ్ వద్ద తోటలో టెక్నీషియన్స్ అందరూ కలిసి కార్తీకమాస వనభోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి నల్లా శివకుమార్, ట్రెజర్ జమితార శేఖర్, గుబ్బల శ్రీను, ఎ.శ్రీధర్ రెడ్డి, వట్టి శ్రీనివాస్, బత్తుల నాగేశ్వరరావు, బండి దుర్గాప్రసాద్, జిల్లాలోని కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.